

సిద్దిపేట జిల్లా కేంద్రంలో వరిధాన్యం ఆరబోస్తున్న మహిళ



మెదక్ జిల్లాలో పచ్చని పంటపొలాలు



సిద్దిపేట జిల్లాలో వరికోతలు

- సస్యశ్యామలంగా మారిన మెతుకుసీమ
- గుంట జాగ లేకుండా పంటల సాగు
- పాడిపంటలతో తులతూగుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా
- సమైక్య రాష్ట్రంలో వలసలు.. నేడు బతుకుదెరువు
- రిజర్వాయర్ల నిర్మాణంతో మారిన పరిస్థితులు
- వ్యవసాయాధారిత పరిశ్రమలకు ఫుల్ డిమాండ్
- గ్రామీణ జీవనంలో అనూహ్య మార్పులు
- వ్యవసాయ క్షేత్రాల్లో వెలుస్తున్న ఇండ్లు
- ఇతర రాష్ట్రాల కూలీలకు దండిగా ఉపాధి
- అనేక రాష్ట్రాల నుంచి వరికోత మిషిన్లు రాక
- జీవాల మేపడానికి వచ్చి ఉపాధి పొందుతున్న పెంపకందారులు

# ఎట్లుండె పల్లె.. ఎట్లయ్యింది

## నాడు పల్లె పొమ్మంది.. నేడు బతుకు మారింది

**ఒకప్పుడు పోపో.. పొమ్మని చెప్పిన పల్లెలు ..ఇవాళ రారా..రమ్మని పిలుస్తున్నాయి. నాడు బతుకుదెరువు కోసం భార్యాపిల్లలను వదిలి భీమండి...ముంబయి..షోలాపూర్....హైదరాబాద్ తదితర పట్టణాలకు బతుకుదెరువు కోసం మెతుకు సీమ ప్రజలు వలస వెళ్లారు. బతుకు దెరువు ఎలా ...?కుటుంబ పోషణ ఎలా...?ఇలా ప్రజల జీవన విధానంలో ఏదో ఒక రకమైన దిగులు ఆనాడు వేధించింది. నాడు సాగునీరు లేక.. చేతి నిండా పనిలేక వందలాది కుటుంబాలు వలస బాట పట్టాయి. ఇవన్నీ ఒకప్పటి మాటలు. ఇవ్వాళ ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఇప్పుడు ధైర్యం కనిపిస్తున్నది. ప్రభుత్వ చేయూతతో వ్యవసాయం పండుగలా సాగుతున్నది. రైతులు, రైతు కూలీలు, వలస ప్రజలకు ఉపాధి దొరుకుతున్నది. ప్రభుత్వం సంక్షేమ పాలన సాగిస్తుండడంతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతున్నది.**

సిద్దిపేట, నవంబర్ 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సీఎం కేసీఆర్ భగీరథ ప్రయత్నం చేసి ఎక్కడో ఉన్న గోదారమ్మను ఉమ్మడి మెదక్ జిల్లాకు తెచ్చి నెర్రెలు వారిన, బీడు భూముల్లో గోదావరి జలాలు పారించడంతో బంగారు పంటలు పండుతున్నాయి. పాడిపంటలతో సస్యశ్యామలంగా మారి పల్లె తల్లి సంబురపడుతున్నది. ఎక్కడెక్కడికో వలస పోయిన వారంతా మూడు నాలుగేండ్ల నుంచి తిరిగి సొంత ఊళ్లకు వచ్చి పనులు చేసుకుంటున్నారు. చేసుకున్న వాళ్లకు చేసుకున్నంత పని దొరుకుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పల్లెలు పచ్చని వాతావరణంలో ఉట్టిపడుతున్నాయి. సాగునీరు అందుబాటులోకి రావడం, ఉచిత కరెంట్ సరఫరా, రైతుబంధుతోపాటు ప్రభుత్వ చేయూతతో గుంటజాగ లేకుండా పంటలు సాగవుతున్నాయి. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అన్నదాతలు గట్టు మీద కూరుండి సద్దన్నం తింటూ ఎవుసం చేస్తుండ్రు. ఏ కారుకు ఆ కారు (కాలం) సాగు విస్తీర్ణం పెరిగిపోతున్నది. భూమికి బరువయ్యేలా పంటలు పండుతున్నాయి. పండించిన పంటనంతా మద్దతు ధరకు రైతుల ముంగిటనే కొంటున్నది టీఆర్ఎస్ సర్కారు. రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా డబ్బులను జమ చేస్తున్నది. దీంతో దళారుల పీడ విరగడైంది. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి పనుల కోసం కూలీలు మన వద్దకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు పనులు లేక వలస పోయిన మెతుకుసీమలో, ఇప్పుడు ఎక్కడెక్కడి రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఉపాధి చూపుతున్నాం. వరినాట్లు మొదలుకొని కోతల వరకు ఇక్కడికి వచ్చి పనులు చేస్తున్నారు. జీవాలతో వచ్చి వాటిని మేపుతూ పెంపకందారులు ఉపాధి పొందుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వరికోత యంత్రాలు వారు బతుకుతున్నారు. మెతుకు సీమ అనేక రాష్ట్రాల వారిని అక్కున చేర్చుకుంది. కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ నుంచి గొర్రె మేకలతో పెంపకందారులు వచ్చి మేపుతున్నారు. చెప్పుకుంటూ పోతుంటే పల్లె వాతావరణం పూర్తిగా మారింది. చెరువులు నిండడంతో పాటు రిజర్వాయర్లు నిండుకుండలా ఉన్నాయి. ఎవుసం పనులు జోరు మీద ఉన్నాయి. వ్యవసాయాధారిత పరిశ్రమల్లో కార్మికులకు పని మస్తుగా లభిస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు రావడంతో పల్లె జీవన వ్యవస్థ పూర్తిగా మారింది. ఎటుచూసినా పచ్చని పంట పొలాలు దర్శనమిస్తున్నాయి.



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని రంగనాయక్‌సాగర్

### ఆదరిస్తున్న పల్లెలు...

నాడు వలస బాట పట్టిన పల్లె ప్రజలు.. ఇవాళ సొంత ఊరిలోనే పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పట్టణాలకన్నా పల్లెల్లోనే ఉండడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో ప్రజలకు చేతినిండా పని దొరుకుతున్నది. రోడ్లు బాగై రవాణా సౌకర్యం ఏర్పడడంతో పట్టణాలకు అరగంటలో చేరుకుంటున్నారు. దీంతో గ్రామాల్లోనే హైటెక్ హంగులతో ఇండ్లను కట్టుకొని నివసిస్తున్నారు. తమ వ్యవసాయ పొలాల్లో మంచి భవనాలను నిర్మించుకుంటున్నారు. ఇవన్నింటికి మారిన పరిస్థితులే కారణం అని చెప్పాలి. ఒకప్పుడు గ్రామాల్లో ఇండ్లకు తాళాలు ఉండేవి. కిరాయికి ఉందామంటే ఇల్లు దొరకని పరిస్థితి గ్రామాల్లో ఇప్పుడు ఉన్నది. ఒకప్పుడు ఇండ్లలో ఎవరు ఉండక పడావు ఉండి కూలిపోయాయి. ఇవ్వాళ నెలకు వెయ్యి రూపాయల వరకు కిరాయి ఇస్తామన్న గ్రామాల్లో ఇల్లు దొరకని పరిస్థితి ఉంది. పట్నాల్లో 'టూ లెట్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో పనులు దొరుకుతున్నాయి. హాయిగా ఉన్న ఊరిలోనే పని చేసుకుంటున్నాడు. పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో వ్యవసాయాధిరత పరిశ్రమలకు మంచి గిరాకీ పెరిగింది. ప్రధానంగా ట్రాక్టర్లకు ఫుల్ గిరాకీ ఉంది. వరికోత మిషన్లు, నీళ్లల్లో నడిచే వరికోత మిషన్లు ఇలా అన్ని రకాల మిషన్లకు గ్రామాల్లో ఫుల్ డిమాండ్ ఉంది. బోరుబావుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో రైతులు పడావు భూములను సైతం కొత్తగా పొలాలు అచ్చుకట్టి సాగుచేస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా పదుల సంఖ్యల్లో ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో రైతులతో పాటు ట్రాక్టర్లు కొనుగోలు చేసిన యజమానులు, దానిపై పనిచేసే కార్మికులు, ట్రాక్టర్ గ్యారేజీలకు ఫుల్‌గా పని దొరుకుతున్నది.వ్యవసాయ బావుల మోటరు మరమ్మతులు చేసే దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఆయా గ్రామాల్లోని దుకాణాల్లో విద్యుత్ మోటర్లు మరమ్మతులు చేయించడంతో గిరాకీ పెరిగిందని మెకానిక్‌లు చెబుతున్నారు.





మెదక్ జిల్లాలో నిర్మించిన ఫాంహౌజ్



మెదక్ జిల్లా హవేళీ ఘనపూర్ మండలం బూరుగుపల్లిలో వెలసిన బిర్యానీ పాయింట్

### పక్క రాష్ట్రాల నుంచి మన జిల్లాలోకి ..

సీఎం కేసీఆర్ ఎనిమిదేండ్లలోనే సాగునీటితో పాటు ఇతర రంగాల్లో తెలంగాణ రాష్ట్రం గణనీయంగా అభివృద్ధి సాధించింది. పల్లెల్లో పచ్చని వాతావరణం సాధ్యమైంది. అన్ని వర్గాల వారికి చేతినిండా పని దొరుకుతున్నది. ఇవాళ ఇతర రాష్ట్రాలకు ఆతిథ్యం, ఆశ్రయమిస్తున్నది. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి కూలీలు పెద్ద ఎత్తున వచ్చి పనులు చేసుకుంటున్నారు. నాట్ల నుంచి వరి కోతల వరకు అన్ని పనుల్లో ఉపాధి పొందుతున్నారు. రైస్‌మిల్లులు, ఇతర పరిశ్రమల్లో కూడా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు ఉన్నారు. వరికోతలు ప్రారంభం కావడంతో ఇక్కడికి ఇతర రాష్ట్రాల నుంచి వరికోత మిషన్లు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఇక్కడి ఉన్నవాటికి ఫుల్ గిరాకీ ఉండడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మిషన్లకు కూడా మంచి గిరాకీ లభిస్తున్నది. ఇటీవల మూగజీవాలు సైతం వస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ నుంచి పెద్ద ఎత్తున జీవాలను మేతకు పాత మెదక్ జిల్లాకు తీసుకువస్తున్నారు. మంజీర ఒడ్డున జీవాలు మేస్తున్న దృశ్యాలు మనకు నిత్యం కనిపిస్తున్నాయి. ఇక్కడే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి దృశ్యాలు చూస్తున్నాం.

### కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు నూతనోత్తేజం...

కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతుల నూతనోత్తేజం వచ్చింది. సమైక్య రాష్ట్రంలో సాగునీరు లేక రైతులు అల్లాడిపోయారు. ఎక్కడో పుట్టినా గోదారమ్మను అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ మీదుగా ఎంతో ఎత్తులో ఉన్న కొండపోచమ్మ వద్దకు నీళ్లు తీసుకువచ్చిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్. మెదక్ జిల్లాలో వనదుర్గా ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. సింగూరు జలాలను సంగారెడ్డి, మెదక్ రైతులకు అందిస్తున్నారు. దీంతో ఈ జిల్లాలో బంగారు పంటలు పండుతున్నాయి. హల్దీ, కూడవెల్లి వాగుల్లో గోదావరి జలాలు పారుతున్నాయి. రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను దేవుడంటున్నారు రైతులు. ఇన్నాళ్లు రైతుల కోసం ఎవరూ ఇంతలా ఆలోచించలేదు. రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రవేశపెట్టి సీఎం కేసీఆర్ వెన్నుదన్నుగా నిలిచారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొండపోచమ్మకు గోదావరి జలాలు వస్తుండడంతో కాల్వల ద్వారా చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నిండి వాటి పరీవాహక ప్రాంతాల్లో గణనీయంగా భూగర్భ జాలలు పెరిగాయి. చెంబుతో నీళ్లు ముంచుకునే రోజులు వచ్చాయి. ఇన్నాళ్లు నీళ్లు లేక పడావున్న భూముల్లో రైతులు సిరుల పంటలు పండిస్తున్నారు.నల్లరేగడి, ఎర్రనేలలు మంచి సారవంతమైన భూములు కావడంతో పంటలు పుష్కలంగా పండుతున్నాయి. ఎక్కడ చూసినా సస్యశ్యామలంగా పరిస్థితులు మారాయి.



రాయపోల్ మండలం విరానగర్‌లో ప్రజాలకు అభివాదం చేస్తున్న ఫరూఖ్‌హుస్సేన్, పృథ్వీరెడ్డి



బేగంపేటలో మెదక్ ఎంపీ తనయుడు పృథ్వీరెడ్డి నుదుట తిలకం దిద్ది హారతి ఇస్తున్న మహిళలు

# ఆలోచించి ఓటేయాలి

## కాంగ్రెస్‌ను నమ్మితే భవిష్యత్ అంధకారం.. సీఎం కుర్చీకోసమే తప్ప ప్రజల సమస్యలు పట్టవు

- బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో 24 గంటల కరెంట్ ఎందుకు ఇవ్వడంలేదు
- దేశంలోనే ఆదర్శంగా సీఎం కేసీఆర్ పాలన
- దుబ్బాకలో అసత్య ప్రచారం చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి మానవత్వం లేదు
- మాటలతో ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే రఘునందర్‌రావు
- మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్
- దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా రాయపోల్ మండలంలో ప్రచారం
- గ్రామ గ్రామాన ప్రజల నీరాజనం

రాయపోల్, నవంబర్ 11: కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే భవిష్యత్ అంధకారమవుతుందని, ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్ అన్నారు. బీజేపీ,కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో రైతులకు 24 గంటల విద్యుత్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆయన తనయుడు కొత్త పృథ్వీరెడ్డితో కలిసి శనివారం రాయపోల్ మండలంలోని ఎల్కల్, బేగంపేట, వీరానగర్, అంకిరెడ్డిపల్లి, వడ్డేపల్లి, దోడ్లపల్లి, విరారెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ గ్రామాన ప్రజలు మంగళహారతులు, బతుకమ్మ, బోనాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో చేయలేని అభవృద్ధి కేవలం తొమ్మిదేండ్లలో సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. దేశంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న 24 గంటల విద్యుత్‌తో పాటు వివిధ సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు సీఎం కుర్చీకోసం పాకులాడుతున్నారని, పదవుల కోసం కొట్లాడడం తప్ప ప్రజల కష్ట సుఖాలు పట్టించుకోరని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కాంలకు నీలయమన్నారు. మూడు గంటల కరెంట్ చాలన్న కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తారా..24గంటల పాటు కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్‌కు వేస్తారా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. గత ఉప ఎన్నికల్లో ప్రజను మోసం చేసి వాగ్దానాలను విస్మరించిన ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు మళ్లీ ఓటు వేస్తే భవిష్యత్ అంధకారమేనన్నారు. టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పచ్చి బ్రోకర్ అని, టికెట్ల కోసం కొట్లాడుతూ ఆపార్టీ నాయకులు ఛీకొడుతున్నా సిగ్గులేకుండా సీఎం కేసీఆర్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవ చేశారు. రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న బీఆఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. మనవత్వం కలిగిన వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు.గతంలో టీడీపీలో ఉన్న చెరుకు ముత్యంరెడ్డి అనారోగ్యానికి గురైతే విషయం తెలుసుకుని విదేశాల్లో మెరుగైన వైద్యం చేయించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. నాడు సీఎం కేసీఆర్ ఎంతో గొప్ప వ్యక్తి అన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి నేడు విమర్శించడం సిగ్గుచేటన్నారు. మెదక్ ఎంపీపై కత్తిపోట్లను ఖండించాల్సిందిపోయి అసత్య ప్రచారాలు చేయడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు నీతిలేదన్నారు.

### మా నాన్నను గెలిపించండి .. సేవకుడిగా పనిచేస్తాడు

మీ ఆశీర్వాదంతో మెదక్ ఎంపీగా కొత్త ప్రభాకర్‌రెడ్డి పదేండ్లు గెలిచి సేవ చేశాడని, దుబ్బాక ఎమ్మెల్యేగా మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సహకారంతో మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తనయుడు పృథ్వీరెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దన్నారు కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ కావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు

### గ్రామగ్రామాన జాన నీరాజనాలు


మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రచారానికి అపూర్వ స్పందన లభించింది. సర్పంచ్‌లు శ్యామాల కుమార్,ప్రవీణ్,వెంకటనర్సింహారెడ్డి, చంద్రశేఖర్, ఎంపీటీసీ పిట్ల వెంకటయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, జడ్పీటీసీలు యాదగిరి, అర్జున్‌గౌడ్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మర్ శ్రీనవాస్, మండల కోఆప్షన్ సభ్యుడు పర్వేజ్, రాష్ట్ర యువజన నేతలు రాజిరెడ్డి, దయాకర్, పాల్గొన్నారు.



బిడ్డ నా ఓటు కారుగుర్తుకు వేస్తా అంటున్న రాయపోల్ మండలంలోని వృద్ధురాలు



రాయపోల్ మండలం బేగంపేటలో పృథ్వీరెడ్డికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



అంకిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మండల సీనియర్ నేత రాజిరెడ్డితో పృథ్వీరెడ్డి కరచానలం



ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ సమక్షంలో పృథ్వీరెడ్డికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న బేగంపేట యాదవులు